క్లుప్తంగా

మెగా జాబ్ మేళాలో 118 మందికి ఉద్యోగాలు

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు డొంక వద్ద గల మహిళా ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి మెగా జాబ్‌మేళాలో 118 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మెగా జాబ్ మేళాకు మొత్తం 252 మంది హాజరవగా, పది కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు రవితేజతో పాటు ఏపీఎస్ఎస్డీసీ ప్రతినిధి శ్రీను నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ శ్రీనివాసాచారి, ఏపీఎస్సీ ప్రతినిధి సాయి ప్రణీత, ఎన్టీఓ కో ఆర్డినేటర్లు ఎస్కే బాషా, అనూష, అబ్దుల్ రెహ్మాన్, మహిళా ప్రాంగణ ప్రతినిధి శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఆదివారం పాకల బీచ్‌కు ప్రత్యేక బస్సులు

ఒంగోలు మెట్రో: జిల్లాలోని సింగరాయకొండకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న పాకల బీచ్‌కు ఏపీఎస్ఆర్టీసీ ఒంగోలు డిపో నుంచి ప్రతి ఆదివారం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఒంగోలు డిపో మేనేజర్ ఘట్టమనేని శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్ చార్జీ పెద్దలకు రూ.55, పిల్లలకు రూ.30 అని వెల్లడించారు. ఉదయం ఏడు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు, పాకల నుంచి ఒంగోలుకు ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు బస్సులు నడుస్తాయన్నారు. ఆదివారం విహారయాత్రకు వెళ్లాలనుకునే వారు వినియోగించుకోవాలని కోరారు. మహిళలకు ఉచిత ప్రయాణం కూడా వర్తిస్తుందన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘ నాయకులు

చీమకుర్తి: స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం చీమకుర్తిలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 23 శాతం రిజర్వేషన్లు మాత్రమే కల్పించారన్నారు. జనాభా దామాషా ప్రకారం కేటాయించాలన్నారు. దాంతో పాటు ఎన్నికల హామీలో భాగంగా బీసీలకు రక్షణ చట్టం అమలు చేయాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్‌లు చల్లా అంకులు, కొత్రపు రాఘవ, పిన్నిక శ్రీనివాసరావు, షేక్ ఖాదర్‌బాషా, పీ వీరనారాయణ, మద్రి లక్ష్మీనారాయణ, బత్తుల మల్లికార్జున, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అమ్మనబ్రోలు, ఉప్పుగుండూరులో అవగాహన కార్యక్రమం



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్సై రజియా సుల్తానా

నాగులుప్పలపాడు: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతులు లేకుండా ఎవ్వరూ దీపావళి మందులు అమ్మరాదని నాగులుప్పలపాడు ఎస్సై రజియా సుల్తానా స్పష్టం చేశారు. మండలంలోని అమ్మనబ్రోలు, ఉప్పుగుండూరు గ్రామాల్లో దీపావళి మందులు విక్రయిస్తున్న షాపుల నిర్వాహకులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. క్రాకర్స్ అమ్మకాల కోసం తీసుకోవాల్సిన అనుమతులతో పాటు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

నేడు కోటి సంతకాల సేకరణ

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చీమకుర్తిలో నిర్వహణ
- ముఖ్య అతిథులుగా హాజరు కానున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున
- విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుల పిలుపు



కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించనున్న రచ్చబండను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ చీమకుర్తి మండల నాయకులు

చీమకుర్తి: రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలను సీఎం చంద్రబాబు ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ శనివారం చీమకుర్తిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మండల రూరల్ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు బీమన వెంకట్రావు, ఏ రామబ్రహ్మం, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఏలూరి సురేష్, చీదర్ల శేషుతో కలిసి రచ్చబండ నిర్వహించే ప్రదేశాన్ని శుక్రవారం శేఖరరెడ్డి, వెంకటేశ్వర్లు పరిశీలించారు. చీమకుర్తిలోని గరికమిట్టలో రచ్చబండ వద్ద నిర్వహించే కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. పేద విద్యార్థులు వైద్య విద్య అభ్యసించేందుకు, పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. దానిని వ్యతిరేకిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించే కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు పిలుపునిచ్చారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి

- ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, పక్కన ఎంపీడీఓ జ్యోతి

మద్దిపాడు: మండలంలోని అధికారులు ప్రొటోకాల్ పాటించాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని పలువురు సభ్యులు సమావేశంలో లేవనెత్తడంపై ఆమె మాట్లాడారు. గ్రామాల్లో కూటమి ప్రభుత్వంలోని నాయకులు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నారని, ఆ క్రమంలో స్థానిక సర్పంచ్‌లకుగానీ, ఎంపీటీసీ సభ్యులకుగానీ తెలియజేయడం లేదని అన్నారు. ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులకు లేదా అని ప్రశ్నించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన ప్రగతి వివరాలు తెలిపారు. ఆయా శాఖల ద్వారా ప్రజలకు చేకూరతున్న లబ్ధి, పథకాల గురించి సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.జ్యోతి, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

ఒంగోలు మెట్రో: వాసవీ క్లబ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షుడు భూమా శ్రీనువాసులు నేతృత్వంలో ఒంగోలు గాంధీరోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి దేవస్థానంలో శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ జిల్లా గవర్నర్ చుండూరు గాయత్రి, క్యాబినెట్ కార్యదర్శి మార్పూరి రాఘవేంద్రరావు పాల్గొని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవికి సారె సమర్పించారు. అనంతరం పేద మహిళలకు చీరలు, పలువురికి నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మద్దాలి శివప్రసాదరావు, కోశాధికారి బియ్యపు సంపత్‌కుమార్, జిల్లా అధికారులు తుమ్మపూడి ఏడుకొండలు, రీజియన్ చైర్మన్ చలువాది సత్యనారాయణ, రంగస్వామి, జి.రంగనాథ్, అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు కే హరిప్రసాద్, క్లబ్ సభ్యులు రాధా రమణగుప్తా జంధ్యం, గుర్రం కృష్ణ, చీమకుర్తి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలులో డీఆర్ఓ ఓబులేసుకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు



ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి అక్రమాలపై కథనాలు రాస్తున్న జర్నలిస్టులపై, సాక్షి దినపత్రికపై పోలీసులచే అక్రమ కేసులు పెట్టించి వేధింపులకు గురిచేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఒంగోలులో జర్నలిస్టులు ఆందోళనకు దిగారు. కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి డీఆర్వో ఓబులేసు, డీఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రాలు అందజేశారు.

\- సాక్షి, ఒంగోలు

భక్తిశ్రద్ధలతో ఏకాదశి వ్రతాలు



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు



కమ్మపాలెంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు

ఒంగోలు మెట్రో: సత్యనారాయణస్వామి జన్మ నక్షత్రంతో పాటు శుక్రవారం కలిసి రావడంతో జిల్లా వ్యాప్తంగా వైష్ణవాలయాలలో ప్రత్యేక పూజలు, ఏకాదశి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒంగోలు కేశవస్వామి పేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో, ఒంగోలు కొప్పోలు రోడ్డులోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో, రంగారాయుడు చెరువు దగ్గర భూదేవి శ్రీదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో, సమతానగర్ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో, కమ్మపాలెంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో, మంగమూరు రోడ్డులోని హరిహరసుత అయ్యప్ప క్షేత్రంలో ఉపాలయంగా ఉన్న వెంకటేశ్వరస్వామి ప్రాంగణంలో, త్రోవగుంట వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో, పేర్నమిట్ట వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో, మంగమూరు ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం పది గంటలకు ఆలయ అర్చకులు సామూహికంగా పాల్గొన్న దంపతులచే గణపతి పూజ, మండపారాధన, కలశ పూజ, అభిషేకం నిర్వహించారు. రమా వసుంధర సమేత సత్యనారాయణ స్వామి అష్టోత్తర పూజా క్రతువులు నిర్వహించి స్వామివారి లీలా విశేషాలను భక్తులకు అర్చకులు వివరించారు.

లయోలా కళాశాల సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
- కళాశాల అభివృద్ధికి రూ.5 లక్షల ఆర్థిక సాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: పేద విద్యార్థులకు ఉన్నత విద్యనందిస్తున్న లయోలా కళాశాల సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక లయోలా కళాశాలను శుక్రవారం పాస్టర్‌ల ఆహ్వానం మేరకు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కళాశాల పాస్టర్‌లు ఘన స్వాగతం పలికారు. పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కళాశాలలో తరగతి గదులు పరిశీలించారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మంచి లక్ష్యంతో లయోలా కళాశాల ఏళ్ల తరబడి ఎంతో మంది పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందిస్తోందన్నారు. ఇటువంటి సంస్థలను సహృదయంతో ఆదుకోవడంలో ఎంతో ఆనందంగా ఉందన్నారు. తన వంతు సహకారంగా కళాశాల అభివృద్ధికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించారు. కళాశాలలో దైవ చింతనతో పాటు మంచి లక్షణాలు విద్యార్థులకు బోధిస్తున్నారని చెప్పారు. మంచి మార్గంలో పయనించే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో గోల్‌ను ఎంచుకుని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. పాస్టర్‌లు దైవచింతనతో పాటు విద్యార్థులను మంచి మార్గంలో నడిపించడంలో సఫలమవుతున్నారంటూ వారిని అభినందించారు. కళాశాలకు రానున్న రోజుల్లో తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, వార్డు కౌన్సిలర్ మేడగం మోహన్‌రెడ్డి, ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గల్లిపోగు ఏసుదాసు, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, లయోలా కరస్పాండెంట్ ఫాదర్ బాలశౌరి, ప్రధానోపాధ్యాయుడు ఫాదర్ మైకేల్ రాజు, కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ ఆంథోని పాల్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో రిపోర్టులు పంపడం లేదని ఫిర్యాదు



డీఆర్ఓ ఓబులేసుకు వివరాలు వెల్లడిస్తున్న నాగేంద్రరావు

ఒంగోలు సబర్బన్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో తహసీల్దార్లు రిపోర్టులు పంపడం లేదని, అలాంటి తహసీల్దార్లపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఆ మేరకు శుక్రవారం డీఆర్ఓ సీహెచ్ ఓబులేసును ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కేసుల పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ గురించి చర్చించారు. జిల్లాలో మెజారిటీ తహసీల్దార్లు ఎస్సీ, ఎస్టీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడం తహసీల్దార్లకు ఇష్టం లేదన్నారు. కలెక్టరేట్ నుంచి రిపోర్టులు పంపాలని అనేక రిమైండర్లు వస్తున్నా స్పందించడం లేదన్నారు. తహసీల్దార్ల ఉద్దేశపూర్వక కాలయాపన వలన పెన్షన్లు రాక సంవత్సరాల తరబడి పలువురి జీవనోపాధికి ఇబ్బంది ఎదురవుతోందన్నారు. ఉద్యోగాల మంజూరులో జాప్యం కారణంగా సీనియార్టీ పోతోందన్నారు. కలెక్టరేట్ అధికారులు అడిగిన సమాచారం మాత్రమే ఇవ్వాల్సిన తహసీల్దార్లు.. సొంత కవిత్వం జోడించి ఎస్సీ, ఎస్టీలపై వారికున్న వివక్షను నివేదికల్లో చూపిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగి మరణిస్తే ఆ ఉద్యోగి కుటుంబ సభ్యుడికిచ్చే ఉద్యోగం హక్కు కాదని, కేవలం కారుణ్య నియామకం అని సుప్రీం కోర్టు చెప్పిన విషయాన్ని తహసీల్దార్లు మర్చిపోయారన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద నమోదయ్యే హత్య, బలవన్మరణం, అత్యాచారం కేసుల్లో మృతుడి కుటుంబ సభ్యులకు ఇచ్చే ఉద్యోగం పార్లమెంటు ఇచ్చిన హక్కు అని తహసీల్దార్లకు తెలియడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగి మరణానంతరం కుటుంబ సభ్యుడికి ఉద్యోగం ఇచ్చేందుకు రూపొందించిన మార్గదర్శకాలకు – ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో బాధితులకు ఇచ్చే ఉద్యోగాలకు సంబంధమే లేదన్నారు. ఇవేవీ తహసీల్దార్లకు తెలియకపోవటం వలన జిల్లాలో నష్టపోతున్న బాధితుల వివరాలు తెలియజేసి ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై తహసీల్దార్లకు వర్క్ షాప్ నిర్వహించాలని నాగేంద్రం డిమాండ్ చేశారు. స్పందించిన డీఆర్ఓ ఓబులేసు పెండింగ్ ఫైళ్లు సర్క్యులేట్ చేయాలని మెజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కల పంపిణీ

సంతనూతలపాడు: పర్యావరణ పరిరక్షణకు మొక్కల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడు మండలం గుమ్మలంపాడు గ్రామంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు ఎంపీడీవో డి.సురేష్ బాబు మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి మూడో శనివారం ప్లానిటేషన్ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్, బొడ్డపాటి చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

లైసెన్సులు లేకుండా బాణసంచా అమ్మరాదు

మద్దిపాడు: లైసెన్సులు లేకుండా మండలంలోని గ్రామాల్లో బాణసంచా అమ్మరాదని ఎస్ఐ వెంకట సూర్య స్పష్టం చేశారు. లైసెన్సులు లేకుండా బాణసంచా అమ్మే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎవరైనా తాత్కాలికంగా అమ్మాలనుకుంటే సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

పేకాట శిబిరంపై దాడి

నాగులుప్పలపాడు: పేకాటాడుతున్న వ్యక్తులపై దాడి చేసి వారి వద్ద నుంచి నగదు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు నాగులుప్పలపాడు ఎస్సై రజియా సుల్తానా తెలిపారు. మండలంలోని తిమ్మసముద్రం గ్రామ సమీప పొలాల్లో పేకాటాడుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు చెప్పారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,100 నగదు, రెండు సెల్‌ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెల్లడించారు. ఈ దాడిలో ఏఎస్సై సుబ్బారావు, కానిస్టేబుళ్లు హరికృష్ణ, రెహమాన్, నారాయణ, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ



మరియదాసును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

తాళ్లూరు: మండలంలోని దారంవారిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యాకర్త జి.మరియదాసు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం రాత్రి ఆయన గృహానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని, ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ మంచాల వెంకటేశ్వరరెడ్డి, గ్రామ నాయకులు దారం రమణారెడ్డి, మారం అంజిరెడ్డి, కాకి తిరుపతయ్య, దార్ల శ్రీను, నూకతోటి పిచ్చయ్య ఉన్నారు.

విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న కోటేశ్వరరావు, పద్మావతి, శ్రీనివాసరావు

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న సీహెచ్ కోటేశ్వరరావు తన సొంత నిధులతో పదో తరగతి విద్యార్థులకు గణితం దీప్తి మెటీరియల్‌ను శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఎంఈవో–2 పద్మావతి, పాఠశాల హెచ్ఎం బి.శ్రీనివాసరావు, కోటేశ్వరరావు చేతుల మీదుగా విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ హరిబాబు, గణిత ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, కృష్ణ కుమార్, సైన్స్ టీచర్ శ్రీనివాస్, కృష్ణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కురిచేడు: మండలంలోని కురిచేడు, వెస్ట్ వీరయపాలెంలో మండల వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ శుక్రవారం వరి, కంది పంటలను పరిశీలించారు. ప్రస్తుతం వరి పైరులో ఎక్కువగా ఆకు ముడతను గమనించామని, గొంగళి పురుగు ఆకు ముడతలో ఉండి పత్ర హరితాన్ని గీకి తినేయడంతో ఆకులు తెల్లబడతాయని తెలిపారు. ఆలస్యంగా నాటిన పొలాల్లో, అధిక యూరియా వాడిన పొలాల్లో పురుగు ఉధృతి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రవీంద్ర, మేరి, రైతులు పాల్గొన్నారు.